యథేచ్ఛగా తోడేస్తున్నారు..!

- భారీగా ఏర్పడుతున్న గుంతలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


తవ్వకాలు చేపడుతున్న జేసీబీ

ఆదిలాబాద్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొత్తగూడ, యశ్వంత్ గూడ రెండు గ్రామాల మధ్య మొరం తవ్వకాలు జోరుగా ఊపందుకున్నాయి. మొరాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో భారీ గుంతలు ఏర్పాడుతున్నాయి.

గతంలో పలు ఘటనలు..

మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలో తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో బహిర్భూమికి వెళ్లిన యాపల్‌గూడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. యాపల్‌గూడ గ్రామ పంచాయతీకి ఆనుకోని ఉన్న కొత్తగూడ గ్రామ సమీపంలో మొరం తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. మొరం తవ్వకాలు చేపడుతున్న పక్కాన నుంచి రోడ్డు మార్గం ఉండడంతో ప్రతీ రోజు పదుల సంఖ్యలో ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అటు నుంచి రాకపోకలు నిర్వహిస్తున్న వారు అదుపు తప్పి గుంతల్లో పడితే ప్రాణాలు పోయే అవకాశం ఉంది.

సమాచారం ఇచ్చినా..

మండలంలోని కొత్తగూడ శివారు ప్రాంతంలో మొరం తవ్వకాలు చేపడుతున్న విషయాన్ని 'సాక్షి' రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. అయితే సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలి వేయడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్లు తీసుకోని వదిలేశారనే పలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొరం తవ్వకాలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మొరం తవ్వకాల కోసం మండలంలో ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కొత్తగూడ శివారు ప్రాంతాంలో 'సాక్షి' తమ దృష్టికి తీసుకురావడంతో రెవెన్యూ సిబ్బందిని పంపించి తవ్వకాలు నిలిపివేశాం. అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.

– గోవింద్, తహసీల్దార్, ఆదిలాబాద్ రూరల్

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో


శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఇచ్చోడ: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతువేదికలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. సర్వేలో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రభుత్వం ఆదేశాల మేరకు సర్వే చేపట్టాలన్నారు. సమవేశంలో ఎంపీడీవో లక్ష్మణ్, మాస్టర్ ట్రైనర్స్ మహేందర్, రమాకాంత్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: నవంబర్ 6 నుంచి 18 వరకు నిర్వహించే సోషల్ ఎకానమిక్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో కుటుంబాల గుర్తింపు సర్వే చేపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: నవంబర్ 6 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ కుల సర్వేకు సంబంధించి మండల కేంద్రంలో బుధవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో ఫణీంధర్ నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఎంపీవో సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం సమగ్ర కుటుంబ సర్వేపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నవంబర్ 6 నుంచి ప్రారంభం కానున్న సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రమేశ్, ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పించారు. ఈజీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో దండారీ సంబురాలు


గుస్సాడీలతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం పాల్గొన్నారు. ఆయనకు గుస్సాడీలు, ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ: బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దండారీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. బుధవారం మండలంలోని జాకీర్‌గూడ, కోసుపటేల్ గూడ గ్రామంలో గుస్సాడీ ధరించి, గిరిజనులతో ఆడిపాడారు. అనంతరం ప్రభుత్వం దండారీలకు మంజూరు చేసిన రూ. 15 వేల చెక్కును అందజేశారు.

బోథ్: మండలంలోని ఆదివాసీ గూడెల్లో దండారీ సంబురాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. పట్నాపూర్ గ్రామంలో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. బాబెర గ్రామంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ దండారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: దండారీ ఉత్సవాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం అందజేశారు. శాంతాపూర్‌లో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో పాల్గొని 20 దండారీ బృందాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, మండల బీఆర్ఎస్ నాయకులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గుస్సాడీలు


పాల్గొన్న ఎస్సై ప్రవీణ్ కుమార్

పూడికతీత పనులు ప్రారంభం


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న జేసీబీ

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ పూడికతీత పనులు బుధవారం అధికారులు ప్రారంభించారు. మత్తడివాగు కుడి కాలువలో ఏపుగా తుంగ, గడ్డి పెరిగింది. దీంతో సాగునీటి ఇబ్బంది లేకుండా అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టారు. పిచ్చి, గడ్డి మొక్కలను జేసీబీతో తొలగించారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడం కోసం కాలువలో పేరుకుపోయిన గడ్డి, మట్టిని తొలగిస్తున్నట్లు ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు.

పరామర్శ

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో బుధవారం జాదవ్ తుకారాం కుటుంబాన్ని ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్ పరామర్శించారు. మంగళవారం తుకారాం కోడలు జాదవ్ రమ్య గుడిహత్నూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కృష్ణ కుమార్, పెందూర్ తులసిరాం, సుభాష్, సరాల శ్రీనివాస్ ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఏలేటి జీవన్ రెడ్డి కుమారుడు మనోజ్ రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. బుధవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ డైరెక్టర్ చందర్ రెడ్డి తండ్రి యెల్మ నర్సింగ్ రెడ్డి గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు

ఆదిలాబాద్‌టౌన్: వృత్తి నిబద్ధతతో పనిచేసే వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న కోట నర్సిములు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. ఇందులో ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య, సెక్టోరల్ అధికారులు ఉదయశ్రీ, సుజాత్ ఖాన్, నారాయణ, కంటె నర్సయ్య, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'ప్రజలకు విద్యుత్ భారం తప్పింది'


కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు రూ.18,500 కోట్ల విద్యుత్ భారం తగ్గించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై మోపాలనుకున్న విద్యుత్ చార్జీల గుదిబండను బీఆర్ఎస్ ఆపిందన్నారు. విద్యుత్ చార్జీలను పెంచకుండా ఇటీవల ఈఆర్‌సీ కమిటీకి నివేదించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనోహర్, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, రమేశ్, జగదీష్, గోవర్ధన్, యూనుస్‌అక్బాని, సాజిద్ పాల్గొన్నారు.

బోథ్: ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో బీఆర్ఎస్ వ్యతిరేకించడం వల్లే ఈఆర్‌సీ విద్యుత్ చార్జీలు పెంపును తిరస్కరించడం జరిగిందని బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు మేరకు గ్రామాల్లో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి శ్రీధర్ రెడ్డి, సురేశ్, బాబుసింగ్, బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్, రవి, ఇష్తేకర్, నాయకులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అధికారం కోసమే డీఎస్పీ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ 90 శాతం అనగారిన వర్గాల పీడిత ప్రజల కోసం, వారి ఆత్మ గౌరవం, అధికారం కోసమే ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భవించిందని జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 3న హైదరాబాద్‌లోని ఆదిభట్లలో నిర్వహించే కార్యకర్తల మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, బడుగు రాజేశ్వర్, తొంటి కూరి సంతోష్, గొంటిముక్కుల ఒమన్న, దొమ్మటి సురేశ్, అగ్గిమల్ల గంగన్న, నవీన్, వినుకుమార్, మధు, జ్యోతిరాం, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కన్నెత్తి చూడడం లేదు'


దుస్తులు అందజేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓటమి చెందిన ప్రజల మధ్యే ఉంటానని, గెలిచిన ఎమ్మెల్యే మాత్రం ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని మామిడిగూడ, దహిగూడ, మొలాల్‌గుట్ట, లొహర, సలాయిగూడ, కొలాంగూడ, కొలాంతిప్ప, ఖండాల గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామస్తులు ఆయనను, పార్టీ కార్యకర్తలను ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపి దుస్తువులు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లు, ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు ప్రభుత్వ పథకాలు అందరికి వస్తాయన్నారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క చొరవతో ప్రభుత్వం ప్రతి దండారీకి రూ. 15 వేలు ఇస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ త్వరలో మొదలవుతుందన్నారు. ఇంటికి రూ. 500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంట్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, సుధాకర్ గౌడ్, షకీల్, భోజారెడ్డి, దేవిదాస్ చారి, పోరెడ్డి కిషన్, జంగు పటేల్, భీంరావు, నారాయణ రెడ్డి, భూమయ్య, సాంటెన్న, సోమన్న, రాజేశ్వర్, భగవాండ్లు ,గంటు బాయి, రాధాబాయి, చిత్రు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'అధిక సాంద్రత' సాగుతో దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాంసి: అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి సాధించవచ్చని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గోట్కూరి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్ వారి సహకారంతో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు అనే అంశంలో భాగంగా పత్తిపంట క్షేత్ర సందర్శన నిర్వహించారు. రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ పద్ధతితో గులాబీ రంగుపురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రాజశేఖర్, రైతులు రోహిత్, గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ క్రియాశీల సభ్యత్వాలు ప్రారంభించాం


క్రియాశీల సభ్యత్వ రసీదు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లాలో క్రియాశీల సభ్యత్వాలను ప్రారంభించడం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు పార్టీ సీనియర్ నాయకులు క్రియాశీలక సభ్యత్వాన్ని అందించారు. జిల్లాలో పార్టీ సభ్యత్వం విస్తృతంగా కొనసాగుతుందన్నారు. వంద సభ్యత్వాలను కార్యకర్తలు వారి రేఫరల్ ద్వారా నమోదు చేస్తే వారికి క్రియాశీల సభ్యత్వాలు అందిస్తామన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 592 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. మండలాల్లో 50, పట్టణంలో 100 సభ్యత్వాల చొప్పున లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యకర్తలు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, లాలామున్న, ఆకుల ప్రవీణ్, మయూర్ చంద్ర, ఆధినాథ్, విజయ్ బోయర్, క్రిష్ణయాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యేను కలిసిన ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్‌బేగం, లెక్చరర్లు బుధవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాలల్లో ఉన్న సదుపాయాలు, అభివృద్ధి పనుల గురించి విన్నవించారు.

కమిషనర్‌కు సన్మానం

కైలాస్‌నగర్: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీవీఎన్.రాజును కాంగ్రెస్ కౌన్సిలర్లు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కలిసిన వారిలో మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్లు బండారి సతీష్, లక్ష్మణ్, నందనర్సింగ్ పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన మాదిగ జేఏసీ నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీవీఎన్.రాజును తెలంగాణ మాదిగ జేఏసీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మల్యాల మనోజ్ కుమార్, మోతే బారికరావు, నక్క రాందాస్, లింగంపల్లి ప్రసన్నకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

పీవీటీజీ ఏపీవోను కలిసిన నేతలు

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల ఐటీడీఏ ఉట్నూర్ పీవీటీజీ ఏపీవోగా బాధ్యతలు స్వీకరించిన మెస్రం మనోహర్‌ను పర్ధాన్ ఉద్యోగుల సంఘం నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మడావి శంకర్, నగేశ్, ఆర్క జగన్, ఛాయా, అనుసుయా పాల్గొన్నారు.

నేడు, రేపు సోయా కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలో సోయా కొనుగోళ్లను గురు, శుక్రవారాల్లో నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. దీపావళి సందర్భంగా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి నవంబర్ 2వ తేదీన కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు 1912 టోల్‌ఫ్రీనంబర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యుత్ శాఖ ఎస్‌ఈజేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌సర్కిల్ వినియోగదారులు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఆశ కార్యకర్తల నిరసన


నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ఆదిలాబాద్‌టౌన్: సర్వే పేరిట ఆశ కార్యకర్తలతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ అన్నారు. బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ పారితోషికం లేని సర్వేలను ఆశ కార్యకర్తలతో చేయించవద్దని పేర్కొన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్, కనీస వేతనాలు ఇవ్వకుండా సర్వేల పేరిట వెట్టిచాకిరి చేయించడం సరికాదన్నారు. సర్వేలు చేయిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు సుజాత, కాంత, రాధ, పార్వతి, లక్ష్మి, పుష్ప, కిరణ్, బండి దత్తాత్రి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

4న జోనల్‌స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ జోనల్‌స్థాయి అండర్-17 బాలుర కబడ్డీ ఎంపిక పోటీలను మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 4న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, పోటీల కన్వీనర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం బోనాఫైడ్‌తో 4వ తేదీన ఉదయం 9 గంటలకు పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ రవీందర్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 96669 07755 సంప్రదించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సంజీవ్ రెడ్డి, అధ్యక్షుడిగా భూమయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా నిఖిల్‌రెడ్డి, అసోసియేట్ మహిళా అధ్యక్షురాలుగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా అశోక్, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్, భువనేశ్వరి, కోశాధికారిగా స్వరూప రాణి, కార్యదర్శులుగా జ్యోతి, శ్రీరాం, శారదలను ఎన్నుకున్నారు.

వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సిర్ర దేవేందర్

ఎదులాపురం: మున్సిపల్ కార్మికులకు ప్రతీ నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందులో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా అందించే ఎలక్ట్రీషన్ కోర్సుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ ఏడీ. నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణనివ్వడంతో పాటు ఉచిత భోజనం, స్టేషనరీ, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు రూ. 18వేల నుంచి రూ.20 వేల వేతనంతో కూడిన ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించనున్నట్లుగా పేర్కొన్నారు. ఎస్సెస్సీ పాస్ అయి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు శిక్షణకు అర్హులన్నారు. నవంబర్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 98665 65156 సంప్రదించాలని కోరారు.

'విద్యుత్ చార్జీల పెంపు భారం బీఆర్ఎస్‌దే'

బోథ్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాష్ట్ర ప్రజలపై రూ. 20 వేల కోట్ల విద్యుత్ భారం మోపినట్లు కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచకపోగా గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తూ ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. ఘనకార్యం చేస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

బ్యాంక్‌లో ముందస్తు దీపావళి వేడుకలు


దీపావళి వేడుకల్లో సామాజిక కార్యకర్త

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి పాల్గొన్నారు. వినియోగదారులు, బ్యాంక్ సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో 108కు ఫోన్ చేయండి

బోథ్: దీపావళి సందర్భంగా టపాసులు పేల్చే సందర్భంలో, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు సంభవిస్తే 108కు ఫోన్ చేయాలని ఆపరేషన్స్ రాష్ట్ర అధికారి ఖలీద్ , జిల్లా మేనేజర్ సామ్రాట్‌లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. పండుగ సమయంలో ప్రమాదాల సంభవిస్తే నివారణకు 108 అంబులెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు.